విద్యార్థుల సంక్షేమానికి ఎన్నో పథకాలు




నాగారం ఎస్సీకాలనీలో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి. ఫుట్‌బాల్ క్రీడాకారుడు సాయిశ్రీనివాస్‌ను సత్కరిస్తూ..

నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇకపై మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందిస్తామన్నారు. ఇంతమంచి పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రభుత్వం ఆధ్వర్యంలో మున్సిపాలిటీల పరిధిలోని యువత కోసం పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్లను ఆయన మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్‌తో కలిసి పంపిణీ చేశారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఫుట్‌బాల్ టీంకు సబ్‌జూనియర్‌గా ఎన్నికైన నాగారం ప్రాంతానికి చెందిన క్రీడాకారుడు సాయిశ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాంరెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, పంగ హరిబాబు, దివ్యదయాకర్‌రావు, అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, నాగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వన సేవే.. దేశ సేవ

కమలానంద భారతీ స్వామి



వనవాసీ సదస్సులో మాట్లాడుతున్న కమలానంద భారతీ స్వామి

పోచారం: వనాల నుంచి ఎందరో మన జాతికి సేవలు చేశారని కమలానంద భారతీ స్వామి అన్నారు. అన్నోజిగూడలోని రాష్ట్రీయ విద్యా కేంద్రంలో మూడు రోజుల పాటు జరగనున్న అఖిల భారతీయ వనవాసీ కల్యాణ ఆశ్రమ కార్యకారిణి సమావేశాలను శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వన సేవను దేశ సేవగా భావించాలన్నారు. వనాలు లేనిదే రామ పట్టాభిషేకం, అంటే రామాయణమే లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు అభినందనీయం అన్నారు. వనవాసీలు సాధించిన ఘనత ప్రశంసనీయం అన్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఇచ్చమ్మకు స్త్రీశక్తి అవార్డును గుర్తు చేశారు. వనవాసీ విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదిగి చంద్రయాన్-3 సఫలతకు కారణం కావడం గర్వించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో వనవాసీ కల్యాణ్ ఆశ్రమ్ అఖిల భారత అధ్యక్షుడు రాంచంద్ర కరాడే, సంఘటన మంత్రి అతుల్, ఆశ్రమ్ నేపాల్ అధ్యక్షుడు కమల్ రాజవంశీ, పద్మశ్రీ కనకరాజ్, విక్రం బహదూర్, సత్యేంద్ర, డా. హెచ్‌కే నాగూ, మహేశ్ బాల్‌డాతో పాటు 750 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్‌పై కేసు నమోదు



హేమంత్ కుమార్ (ఫైల్)

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ ట్యాక్స్‌ల నిధులు కాజేసిన బిల్ కలెక్టర్‌పై ఘట్‌కేసర్ పీఎస్‌లో శుక్రవారం కేసు నమోదైంది. సీఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ ప్రజలు చెల్లించిన ట్యాక్స్‌ల నిధులు ఏప్రిల్, 2021–అక్టోబర్ 2022 వరకు అవకతవకలకు పాల్పడినట్లు ఆడిటింగ్‌లో తేలిందన్నారు. కమిషనర్ సాబేర్ ఆడిటింగ్‌కు ఆదేశించగా రూ.3.13 కోట్ల ఆర్థిక అవకతవకలు జరిగినట్లు తేలింది. దీనిపై విచారణ జరిపి అవినీతికి పాల్పడిన బిల్ కలెక్టర్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయి హేమంత్‌కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు బిల్ కలెక్టర్ హేమంత్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు.

సిమెంట్ వ్యాపారంలో ఎదురులేని శక్తిగా భారతి సిమెంట్



ప్రమాద బీమా బాండ్‌లను అందజేస్తున్న నితీష్‌యాదవ్

శామీర్‌పేట్: సిమెంట్ వ్యాపారంలో ఎదురులేని శక్తిగా ఎదుగుతున్న భారతి సిమెంట్ సంస్థ అల్ట్రా ఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ నితీష్ యాదవ్ తెలిపారు. శామీర్‌పేట్ మండలం లాల్‌గడిమలక్‌పేట్‌లోని మానస మార్కెటింగ్ డీలర్‌షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశంలో ముఖ్య అతిథిగా శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్ నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని వివరించారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయ పడతారని తెలిపారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందన్నారు. తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్‌లను 60 మందికి అందజేశారు. కార్యక్రమంలో డీలర్ శ్రీధర్‌రెడ్డి, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి

మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నేత రమ



సాక్షి, మేడ్చల్ జిల్లా: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెంచిన వేతనాలతో పాటు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన ధర్నాలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. మధ్యాహ్న భోజన నిర్వహణ స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వకూడదని అన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ధర్నాలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు ఉన్నికృష్ణన్, నాయకులు నరసింగరావు, సబిత, పద్మా, లక్ష్మీ, కమల, భాగ్య, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

ఇళ్ల కేటాయింపుపై మంత్రి నోరు విప్పాలి




టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూరి వజ్రేష్‌యాదవ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో స్థానికేతరులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తుంటే మంత్రి మల్లారెడ్డి నోరు విప్పకపోవడంపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఓబీసీ డిక్లరేషన్ కమిటీ కో చైర్మన్ తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రజల మధ్య పారదర్శకంగా డబుల్ ఇళ్ల కేటాయింపులపై డ్రా తీయాల్సి ఉండగా, ఆన్‌లైన్ ద్వారా అలాట్ చేయటం ఏమిటని ప్రశ్నించారు. మేడ్చల్ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి ప్రజలను మోసం చేస్తున్న తీరును కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఎండగడుతోందని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, జిల్లా నాయకులు పోచయ్య, జైపాల్ రెడ్డి, వైస్ గౌడ్, రమణారెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్, ముజీబ్, బాలేష్, మధుసూదన్‌రెడ్డి, భరత్ సింగ్, రాజు పాల్గొన్నారు.

మంగతాయారు పచ్చళ్ల వ్యాపారం

ఘట్‌కేసర్: థర్డ్ జెండర్లు స్వశక్తితో ఎదిగేందుకు రాచకొండ పోలీసులు, ప్రజలు ఏర్పాటు చేసిన వికల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దేవి అనే ట్రాన్స్‌జెండర్ ఘట్‌కేసర్‌లో శుక్రవారం మంగతాయారు పచ్చళ్ల వ్యాపారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పద్మశ్రీ సునీతకృష్ణన్, ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, అడ్మిన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల ఆర్థిక అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. దేవిని ఆదర్శంగా తీసుకొని మిగతా ట్రాన్స్‌జెండర్లు స్వయం ఉపాధితో వ్యాపారాల్లో స్థిరపడాలని సూచించారు.

జాతీయ రహదారి కాషాయమయం



ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరయ్యారు. దీంతో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున బీజేపీ జెండాలు, స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో రహదారి కాషాయమయమైంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు స్వాగతం పలకడానికి జాయతీ రహదారిపై పెద్ద ఎత్తున జెండాలు ఏర్పాటు చేశారు. జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఒకే దగ్గర కనిపించడం, కౌన్సిల్ సమావేశం విజయవంతం కావడంతో బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. కళాశాల ప్రాంగణం, పరిసర ప్రాంతాలు వేలాదిగా హాజరైన నాయకుల వాహనాలతో నిండిపోయాయి.

బస్తీ దవాఖానాలో సౌకర్యాలపై ఆరా



మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని బస్తీ దవాఖానాను మున్సిపల్ శాఖ సీడీఎంఏ పమేలా సత్పతి శుక్రవారం సందర్శించారు. దవాఖానాను ఆమె సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యం, మందుల పంపిణీ వంటి అంశాలపై ఆరా తీశారు. వైద్యుల హాజరు, ఆస్పత్రిలో సేవలు, రోగుల హాజరు తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ దీపికనర్సింహారెడ్డి, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, ఈఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఓ రాంచందర్ తదితరులు న్నారు.

గంజాయి విక్రేతపై కేసు నమోదు



కీసర: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కీసర సీఐ వెంకటయ్య వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ ఇక్బాల్‌నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ కారు డ్రైవర్. నాగారం మున్సిపల్ పరిధిలోని అరవింద్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు, కీసర పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి షేక్ మహబూబ్‌ను అదుపులోకి తీసుకొని 1.5 కిలోల గంజాయి 100 ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కీసర పోలీసులకు అప్పగించారు. కీసర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

సోమారం సర్పంచ్‌ను కొనసాగించాలి

న్యాయస్థానం ఉత్తర్వులు

మేడ్చల్: నిధుల దుర్వినియోగం విషయంలో సస్పెన్షన్‌కు గురైన మండలంలోని సోమారం గ్రామ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డిని తిరిగి పదవిలో కొనసాగించాలని హైకోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. మే నెలలో సర్పంచ్ కరుణాకర్‌రెడ్డిని నిధుల దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయగా కరుణాకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సర్పంచ్‌గా ఆయనను కొనసాగించాలని హైకోర్టు ఆర్డర్ పాస్ చేయడంతో ఆర్డర్ కాపీలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, డీపీఓ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అర్చన కాలనీ వాసులు

మేడ్చల్: పట్టణంలోని 4వ వార్డు కిష్టాపూర్ పరిధిలోని అర్చన కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రి మల్లారెడ్డికి కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. కాలనీవాసులు కౌన్సిలర్ గణేష్‌తో కలిసి మంత్రి నివాసానికి వెళ్లి తమ కాలనీ సమస్యలను విన్నవించి వినతి పత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, వెంటనే నిధులు మంజూరు చేసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు జనార్దన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కమాలకర్‌రెడ్డి, మన్మధరావు, హనుమాండ్లు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కుట్టు మిషన్లతో జీవనోపాధి

చైర్ పర్సన్ పావనీజంగయ్య



ఘట్‌కేసర్‌లో కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: కుట్టు మిషన్లతో జీవనోపాధి పొందాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. ఘట్‌కేసర్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు శుక్రవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించడానికి తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు అందజేస్తోందన్నారు. కుట్టుమిషన్లతో ఇంట్లోనే ఉంటూ స్వయం ఉపాధి పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రవీందర్, పద్మారావు, ఎస్ఎస్ఈఎస్ నిర్వాహకురాలు మంజుల, దాసు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: ఉమ్మడి శామీర్‌పేట మండలంలో శుక్రవారం మంత్రి మల్లారెడ్డి పర్యటించారు. మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామంలో రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు పొందిన లబ్ధిదారులు నిర్వహించిన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాగారంలో అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు నక్కిరెడ్డి పాపమ్మకాలనీలో రూ.20 లక్షల మున్సిపల్ నిధులతో అంతర్గత మురుగు కాల్వల నిర్మాణపనులతో పాటు 3వ వార్డులోని ద్వారకా రెసిడెన్సీ, అయ్యప్పకాలనీ, వెంకటేశ్వరకాలనీలో సుమారు రూ.26 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, కళావతి, నాగేష్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు క్యాసారం అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి



ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్నికల అధికారులు, బూత్ లెవల్ సిబ్బంది ప్రత్యేకంగా ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం వల్ల మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఓటరు తుది జాబితాను ఈ నెల 4న ప్రకటించడం జరిగిందని, 5న అందుకు సంబంధించిన ప్రతులను రాజకీయ పార్టీలకు పంపామని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని గుర్తింపు పొందిన అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బందికి సహకరించి సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి శిక్షణ పొందిన అధికారులు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఎన్నికలు సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని, ఎన్నికల నిబంధనలు పాటించాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. శిక్షణ పొందిన వారు ప్రచారం నుంచి మొదలుకొని ఎన్నికల కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్, కౌంటింగ్, ఎన్నికలలో అభ్యర్థుల ఖర్చు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, శిక్షణ పొందిన ఎన్నికల అధికారులు, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల్లో నోడల్ అధికారులకు విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. నోడల్ అధికారులకు విధులు తదితర అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రతి ఒక్కరూ వ్యవహరించేలా చూడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.

టీహబ్‌తో మల్లారెడ్డి యూనివర్సిటీ ఒప్పందం



టీహబ్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్న మల్లారెడ్డి యూనివర్సిటీ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ శుక్రవారం టీ హబ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు యూనివర్సిటీలో నిర్వహించిన సమావేశంలో వీసీ వీఎస్‌కే రెడ్డి, టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వీసీ మాట్లాడుతూ.. యూనివర్సిటీ నుంచి పలు టెక్నికల్ కోర్సులను నిర్వహిస్తున్నామని, ఈ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులు ముగ్గురు కలిస్తే తమ ఆలోచనలతో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులను ఎటర్‌ప్రెన్యూర్‌లుగా మార్చాలన్న సంకల్పంతో టీ హబ్ నిర్వాహకులను కలిసి ఒప్పందం కుదుర్చుకున్నామని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆంజనేయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరైన మార్గదర్శనంతో విదేశీ విద్య

సరైన మార్గదర్శనంతో విదేశీ విద్య కలను సాకారం చేసుకోవచ్చని మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో ఐడీపీ ఇండియా, మల్లారెడ్డి యూనివర్సిటీలు ఉమ్మడిగా అంతర్జాతీయ విద్యాసదస్సు నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన వీసీ మాట్లాడుతూ.. విదేశాలకు వెళ్లి ఉన్నత విద్య అభ్యసించే వారికి తగిన మార్గదర్శనం అందించాలనే ఉద్దేశ్యంతో సదస్సు నిర్వహించామన్నారు. ఐడీపీ ఇండియా రీజినల్ హెడ్ కౌషల్‌కుమార్, రిజిస్ట్రార్ ఆంజనేయులు, కెరీర్ అండ్ గైడెన్స్ డైరెక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఘట్‌కేసర్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

ఘట్‌కేసర్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించనున్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్‌ను ఉమ్మడి ఘట్‌కేసర్ మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మైసమ్మగుట్ట అమ్మవారి ఆలయం ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కిష్టయ్యముదిరాజ్, కార్యదర్శి శ్రీశైలంముదిరాజ్, మాజీ అధ్యక్షుడు రాధాకృష్ణముదిరాజ్, ఎదులాబాద్ అధ్యక్షుడు బాలరత్నం ముదిరాజ, మాజీ సర్పంచ్ వెంకటేశ్‌ముదిరాజ్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్ ముదిరాజ్, నరేందర్, ఆంజనేయులు, లక్ష్మయ్య, పోచయ్య, ఐలయ్య, నర్సింగ్‌రావు, మహేందర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న చంద్రయ్య గొడుగు

ఘట్‌కేసర్: ప్రపంచ ఫార్మసీ రంగం ప్రస్తుతం తెలంగాణ వైపు చూస్తోందని నైపర్ బయలాజికల్ సైన్సెస్ విభాగాధిపతి చంద్రయ్య గొడుగు అన్నారు. కొండాపూర్ సంస్కృతి ఫార్మసీ కళాశాల బీ ఫార్మసీ, ఫామ్ డీ మొదటి, ఎమ్ ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ప్రేరణ, పరిచయ(ఓరియెంటేషన్) కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఫార్మసీ ప్రాముఖ్యత, ప్రాధాన్యతను వివరించారు. ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్కృతి కళాశాల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, కళాశాల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపల్ శిరీష, ప్రోగామ్ కోఆర్డినేటర్లు నాగశ్రీ, డాక్టర్ స్వాతి, డాక్టర్ సుధాకర్, చైతన్య, ఫార్మసీ విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలి

ఘట్‌కేసర్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని ఢిల్లీ ఐఐటీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు త్రివిక్రం అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో కృత్రిమ విభాగం ఆధ్వర్యంలో 'మీ సొంత జనరేటివ్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మోడల్‌ను నిర్మించడం ఎలా?' అన్న అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కృత్రిమ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ మల్లికార్జున్, ప్రోగ్రామ్ సంచాలకులు అసిస్టెంట్ ప్రొఫెసర్ సరళ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సదస్సు ముఖ్యఅతిథి త్రివిక్రమ్‌తో ఏఐ విద్యార్థులు, అధ్యాపకులు